
# కింకర్తవ్యం

-పి.రాముడు



కండక్టర్ టిక్కెట్...టిక్కెట్ అంటూ వస్తున్నాడు. డబ్బుల కోసం పర్సు తెరిచిన నాకు సగానికి చిరిగి, ప్లాస్టర్‌తో అతికిన ఇరవై రూపాయల నోటు కనిపించింది. ఎక్కడో చిల్లర తీసుకున్నప్పుడు వచ్చి ఉంటుంది.

రెండుమూడు చోట్ల మార్చబోతే పడదంటూ వెనక్కి ఇచ్చేశారు.

ఆనోటు మార్చడానికి ఇంతకంటే మంచి టైం కాదు.

కండక్టర్ దగ్గరకు రాగానే ఆ నోటు అతనికిచ్చాను "ఒక టిక్కెట్ ఇవ్వండి" అని.అతను అలవాటు ప్రకారం కంగారుగా నోటు లోపల వేసుకుని టిక్కెట్, మిగిలిన చిల్లర ఇచ్చేశాడు.

'పెద్ద బరువేదో వదిలిందిలే' అన్న ఫీలింగ్ కలిగింది నాకు.

టిక్కెట్స్ కొట్టడం పూర్తిచేసి సీట్లోకెళ్ళి రైట్ చెప్పాడు కండక్టర్. బస్సు బయలుదేరింది. నేను కూర్చున్న సీటుకి కొంచెం అవతలి సీట్లో బాగా వయస్సు మళ్ళిన దంపతులు కూర్చుని ఉన్నారు. ఆయన లేచి కండక్టరును టిక్కెట్‌కు పోనూ రావలసిన చిల్లరని అడుగుతున్నారు. దిగేటప్పుడు ఇస్తానని అడిగిన ప్రతీసారీ కండక్టర్ వాళ్లకు చెప్పడం, వాళ్ళు మిన్నకుండడం నేను గమనిస్తూనే ఉన్నాను. బస్సు గమ్యం చేరేసరికి గంటన్నర పైనే పట్టింది. నేను బస్సు దిగుతుంటే వాళ్ళు నావెనకే నే దిగిన స్టాప్‌లో దిగారు. కండక్టర్ వాళ్లకు రావలసిన డబ్బు ఇచ్చి బస్సుకి రైట్ చెప్పాడు.

బస్సు వెళ్లిపోయింది. ఆరోజు ఎండప్రతాపం చాలా ఎక్కువగానే ఉంది. ఆటో కోసం చూస్తూన్న నా దృష్టి అప్రయత్నంగా ఆ దంపతులపై పడింది. వాళ్ళిద్దరూ ఒకరినొకరు నువ్వు చూడలేదంటే నువ్వు చూడలేదు అంటూ వాదులాడుకుంటున్నారు.

"సర్లే" అంటూనే "ఇప్పుడెలా?" అంటూ ఢీలా మొహం పెట్టారు ముసలాయన, వాళ్ల సంభాషణను బట్టి నాకర్ధమైంది ఏంటంటే కండక్టర్ వాళ్లకివ్వాల్సిన చిల్లర తాలూకు చిరిగి ప్లాస్టర్ అంటించిన ఇరవై రూపాయల నోటు వాళ్ల చేతిలో పెట్టి చక్కాపోయాడు. ఆనోటు చూస్తే అది అంతకుముందు నేను కండక్టర్‌కి ఇచ్చిందేనని అర్ధమైంది.

తీరా ఆ నోటుని వాళ్ళు బస్సు వెళ్ళిపోయాక చూసుకున్నారు. పైగా వాళ్ల దగ్గర వేరే చిల్లిగవ్వ లేదు. ఆ ఇరవైనోటు మారకపోతే వాళ్ళు వెళ్లవలసిన గమ్యం చేరడం అసాధ్యం. మామూలుగా అయితే ఆనోటు మారడం చాలా కష్టం. "నా మనస్సు కలుక్కుమంది" అప్రయత్నంగా వాళ్లదగ్గరకు నడిచాను. నా కర్తవ్యం బోధపడింది. నా దగ్గరున్న రెండు కొత్త పదిరూపాయల నోట్లు వాళ్లకిచ్చి ఆ ఇరవై నోటు నేను మార్చుకుంటానని చెప్పి తీసుకున్నాను.

అప్పటివరకూ ఢీలాగా ఉన్న వాళ్ళ ముఖాలు ఆనందంతో వెలిగిపోయాయి. వాళ్లలో నేను చూసిన ఆనందం తాలూకు నాకు కలిగిన తృప్తి ఎన్ని ఇరవైనోట్లు పెట్టినా రాదు.

★